


## ధాన్యం కొనుగోళ్లలో తరుగు, కోత చేయొద్దు


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 11 ఏప్రిల్ , 2025 | పేజీలు :08




## దళారుల జోలికెళ్లొద్దు

ప్రజాపక్షం/ఖానాపూర్‌: ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లో సమైక్య సంఘు ఐకెపిఆధ్వర్యంలో ముందస్తుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఇంచార్జీ డి.ఎస్.ఓ కోమల్ రెడ్డి,తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు వరి కోసిన వెంటనే ఎక్కడ అమ్మలో తెలియక ముందుగా వచ్చిన వరి ధాన్యాన్ని దళారులకుఅమ్ముకుంటున్నారని,అందుకే ప్రభుత్వం ముందస్తుగా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఎవరైనా దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ ముందస్తు కొనుగోలు ద్వారా రైతులకు ప్రభుత్వం బియ్యం అందుబాటులో ఉంటుందని దళారులు చెప్పే మాటలు వినకుండా వరి కొనుగోలు కేంద్రాలోనే అమ్ముకోవచ్చని అన్నారు. అదేవిధంగా బీర్నంది గ్రామంలో ఏర్పాటుచేసిన వారి కొనుగోలు కేంద్రంనీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మజీద్, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో డీయంవో సుధాకర్, డిటిఓ రాజేశ్వర్, ఎమ్మార్వో సుజాత, ఆర్.ఐ సత్యనారాయణ,డిటి రాజేందర్, సమైక్య సంఘం అధ్యక్షురాలు గంగరాజు, సుప్రియ, లక్ష్మి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, నాయకులు నిమ్మల రమేష్, కరపే శ్రీనివాస్, శంకర్, శేషాద్రి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సేవలు

**రూ.46 లక్షలతో నిర్మించిన నవజాత శిశు కేంద్రం ప్రారంభం**

**రూ.55 లక్షలతో 40 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు**

**రూ.12 లక్షలతో ఆసుపత్రిలో మెకానైజడ్ లాండ్రీ సిస్టం**

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు**



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రోగులకు ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. ఐఓసిఎల్ సౌజన్యంతో రూ. 46 లక్షలతో పెద్దపల్లి జిల్లా మాతా శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నవ జాత శిశు కేంద్రం, రూ.55 లక్షలతో ఏర్పాటు చేసిన 40 పడకల ప్రత్యేక వార్డు, రూ.12 లక్షలతో కొనుగోలు చేసిన మెకానైజడ్ లాండ్రీలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక అధికారులతో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు ప్రారంభించారు. రూ.3లక్షలతో రోగుల సౌకర్యార్థం 5ఒపి కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐఓసిఎల్ సంస్థ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) క్రింద అందించిన 10 వార్మర్స్, 2 డబుల్ సర్ఫర్ ఫోటో థెరపీ, ఆటోక్లేవ్, సక్షన్t ఆపరేటస్, బబ్ల్ సి పాప్, వెంటిలేటర్, పోర్టబుల్ ఎక్స్ రే వంటి పరికరాలతో నవ జాతశిశుకేంద్రంఏర్పాటు చేశామని అన్నారు. నవ జాత శిశు కేంద్రం ఏర్పాటు చేసినందున ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చర్యలు తీసుకుంటున్నారని, రిస్క్ కేసులను, ప్రీ మెచ్యూర్డ్ ప్రసవాలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రసవాల సంఖ్య నెలకు 200 కు పైగా పెరిగాయని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్ర హిత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా అవుట్ పేషెంట్ సంఖ్య 700 కు పెరిగిందని, రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కంటి శస్త్ర చికిత్సలు, దంత శస్త్ర చికిత్సలు, జనరల్ఞ ఫిజియన్, ఆర్థో శస్త్ర చికిత్సలు పకడ్బందీగా నిర్వహిఇస్తున్నామని, ఇన్ పేషెంట్ సేవలు మెరుగ్గా అమలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల కోసం టిఫ్ఫా స్కానింగ్ అందుబాటులో ఉందని, డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డయాలసిస్ కేంద్రం ద్వారా రోజుకు 15 మంది లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, అనవసరంగా ప్రైవేటు ఆసుపత్రులలో తమ డబ్బును వృధా చేసుకోవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా లభిస్తున్నాయని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిని నిత్యం తనిఖీ చేసి వైద్య సేవలు మెరుగ్గా అందేలా కలెక్టర్ కోయ శ్రీహర్షను ఎమ్మెల్యే అభినందించారు. గ్రంధాలయ సంస్థచైర్మన్అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

## 'కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐని గెలిపిద్దాం'

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః భార త దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని, పేద ప్రజల హక్కుల కోసం సమస్యల కోసం ఉద్యమిస్తున్న సిపిఐని రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి కోరారు.అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలం సీతారాంపూర్ శాఖ మహాసభ కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని సుధీర్ఘ చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐకి ఉందన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాలను సిపిఐ శ్రేణులు ప్రతి శాఖలో ఘనంగానిర్వహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంటు అర్హులైన వారిలో కొందరికి ఇంకా అందడం లేదన్నారు. సిపిఐ నాయకులు ఎర్రం యాదగిరి, కంపెల్లి కొమురయ్య, కాల్వల శ్రీనివాస్, రాకం భాస్కర్, నందమల్ల యేసు బాబు, కాల్వ మల్లేశం, జె.బుచ్చయ్య తదితరులున్నారు.




### అంగన్‌వాడీల ద్వారా మహిళలు, పిల్లల
## సంక్షేమానికి కృషి

**కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, తదితరులు**



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : అంగన్వాడీల ద్వారా మహిళలు, పిల్లల సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అదికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి హాజరై ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, మెప్మా అధికారులు, యునిసెఫ్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 8వ తదేఈ నుండి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో కొనసాగుతున్న పోషణ పక్షం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని, ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. బాలింతలు, గర్భిణి స్త్రీలు, చిన్నపిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు వారికి సకాలంలో పౌష్టికఆహారం, అవసరమైన మందులు అందించి వారి ఆరోగ్య స్థితిగతులలో వృద్ధి తీసుకురావాలని తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మెప్మా పిడి మోతిరామ్, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గౌరవప్రదమైన జీవనాలు కొనసాగిద్దాం

**నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల హితవు**

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : వివిధ పరిస్థితుల కారణంగా సమాజంలో దుర్భర స్థితిలో జీవనాలు వెళ్లదీస్తున్న వారికి తోడ్పాటుగా నిలిచేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున అందిస్తున్న చేయూతను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని గౌరవప్రదమైన జీవనాలు వెల్లదీయాలని జిల్లా జడ్జీ కుంచాల సునీత హితవు పలికారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మినీ మోడ్యూల్ క్యాంపు నిర్వహించారు. దాతల సహకారంతో పలువురికి కుట్టుమిషన్లు, ప్రభుత్వ బాలికల పాఠశాలలు, డిచ్‌పల్లి మానవతా సదన్, కస్తూర్బా విద్యాలయాలకు సానిటరీ నాప్కిన్ వెండింగ్ మెషీన్లు పంపిణీ చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్ తరపున అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను మెప్మా ఆధ్వర్యంలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ. 2.50 కోట్ల విలువ గల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేశారు. జిల్లా జడ్జీతో పాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్య తదితరులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ సునీత కుంచాల మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లు అసంఘటితరంగ కార్మికులు వంటి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి సమాజంలోని పేదరిక నిర్మూలనకు పాటుపడాలనే జాతీయ న్యాయ సేవా సంస్థ లక్ష్యానికనుగుణంగా డీఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో ఈ మోడ్యూల్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ ఎంతగానో పని ఒత్తిడితో కూడుకుని ఉండే విధుల్లో కొనసాగుతున్నప్పటికీ జిల్లా




జడ్జీ విస్తృతస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించటం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం తరపున భాగస్వామ్యమయ్యే అవకాశం లభించడం సంతోషాన్ని కలిగించిందని ఇక ముందు డీఎల్ఎస్ఎ కార్యక్రమాలకు తప్పనిసరిగా సహకారమందిస్తామని స్పష్టం చేశారు. స్వయం ఉపాధి దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్లు సానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు సమకూర్చిన దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్

**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని గ్రామాలతో పాటు ధర్మపురి పట్టణ ప్రజల త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయం వద్ద రెండు నూతన వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. కమలాపూర్ ఇందిరమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న బస్తీ దవాఖానా, చిల్డ్రన్స్ పార్కులను పరిశీలించారు. అమృత్ జల్ నీటి పంపింగ్ పైప్ లైన్ పనులను ప్రారంభించి వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విప్ లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ రానున్న రెండు మూడు నెలల్లో ధర్మపురి పట్టణ ప్రజలకు త్రాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా రెండు నూతన నీటి ట్యాంకులను ప్రారంభించామని త్వరలో మరో రెండు ట్యాంకుల ద్వారా నీటి సప్లై చేస్తామని పేర్కొన్నారు. ధర్మపురి పట్టణానికి తలాపునే గోదావరి నది ఉన్నప్పటికి గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధర్మపురి పట్టణ ప్రజల త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపకపోగా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీరంటూ ఎక్కడో సుదూరంగా ఉన్న ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం నుండి నీరందంచే పరిస్థితి ఉండేదని అన్నారు. చివరి గ్రామాలైన ధర్మపురి ప్రాంత పరిధిలో త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ధర్మపురి ప్రాంతానికి నీటి సమస్య రాకూడదని డబ్బా నీటి పథకం వద్ద 4 మోటార్లు నిత్యం పని చేసేలా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ధర్మపురి పట్టణ నడిబొడ్డున రూ.లు 22 కోట్లతో అమృత్ జల్ పథకం ద్వారా నూతన నీటి ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయరు. పుర కమిషనర్ రాజశేఖర్, దేవస్థానం అధ్యక్షులు జక్కు రవీందర్, నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేష్, నాగలక్ష్మి, చిలుముల లక్ష్మ ణ్, సుముఖ్, ఎస్. గణేష్, రఫియోద్దిన్, షబ్బీర్, తిరుపతి, ఎ. శ్రీనివాస్, తిరుపతి, ఆనంద్, పోచయ్య, సాయికిరణ్ పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణకే పాదయాత్ర

**ప్రజాపక్షం / చందుర్తి :** కేంద్రం లో బిజేపి అనుసరిస్తున్న రాజ్యంగ వ్యతిరేక విధానాలను అరికట్టడానికే రాజ్యంగ పరిరక్షణ పాదయాత్ర అని రుద్రంగి ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం అన్నారు.కాంగ్రెస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యం లో గురువారం మండలం లోని ఆశిరెడ్డి పల్లి , తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల్లో జైబాపు,జైభీమ్,జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. బిజేపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆ కుట్రలను తిప్పికొట్టడానికే పాదయాత్రలు చేస్తూ ప్రజలకు అవగాహణ కల్పిస్తు చైతన్యవంతులను చేస్తున్నామన్నారు.రాజ్యంగాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంమండలకాంగ్రెస్శ్రేణులుపాల్గొన్నారు.

## 14న అంబేద్కర్ జయంతి

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** ఈ నెల 14న జరగనున్న అంబేద్కర్ జయంతిని అధికారికంగా జరపాలని కోరుతూ అంబేద్కర్సంఘాల నాయకులు గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో చంద్రశేఖర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అన్ని గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించేలా గ్రామ అధికారులకు ఉత్తర్వులను జారీ చేయాలని కోరినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా అంబేద్కర్ విగ్రహాలకు కలర్లు వేయించేలా చూడాలని ఎంపిడివో చంద్రశేఖర్ ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, మాలసంఘం మండల అధ్యక్షులు కారం ఇంద్రయ్య, ఉపాధ్యాక్షుడు రవి, జాయింట్ సెక్రటరీ వినోద్, ధశరథం నారాయణ, అజిత్, నగేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శికి సన్మానం

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** ఇటీవలే మెట్పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో మెట్పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన కంతి మోహన్ రెడ్డి విజయం సాధించగా అమ్మక్కపేట గ్రామానికి చెందిన పసునూరి శ్రీనివాస్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంపాత బస్టాండ్ వద్ద ఇరువురిని కంతి మోహన్ రెడ్డి మిత్ర బృందం బుధవారం రాత్రి ఘనంగా సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి మిత్ర బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాలు ఎంతో మేలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని మొగిలిపేట ఓబులాపూర్ గ్రామాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గాంధీజి అంబేద్కర్ ఆలోచన విధానం చాలా గొప్పదని, భారత రాజ్యాంగం నిర్మాణంతో బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని, రాజ్యాంగాన్ని బిజెపి పార్టీ పక్కదోవ పట్టించేలా వ్యవహరిస్తుండడంతో నిజాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడుజలపతిరెడ్డి,మాజీ ఎంపిపి నల్ల రాజన్న, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, నాయకులు రమేష్, శ్రీనివాస్రెడ్డి,ఆనంద్,సురేష్ తదితరులు ఉన్నారు.

## 14న ఆదిలాబాద్లో 'మా భూమి' రథయాత్ర



**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్:** తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్య స్థాపనకు,ప్రజా సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్ ఏప్రిల్ 14న ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను జయప్రదం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జ్ మాతంగి రేవంత్,జిల్లా సీనియర్ నాయకుడు ముదుగుల సదానందం మహారాజ్ కోరారు.గురువారం స్థానిక పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో బీసీ,ఎస్సీ,ఎస్టీ సంయుక్త కార్యాచరణ సమితి,ధర్మ సమాజ్ పార్టీ ఆద్యర్యంలో జరిగిన సమావేశంలో వారు లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా ఇంచార్జ్ మాతంగి రేవంత్,జిల్లా సీనియర్ నాయకుడు ముడుగుల సదానందం మహారాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీ,ఎస్సీ,ఎస్టీలను కేవలం ఓటు బ్యాంకుగా చూశాయని వారు విమర్శించారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలనలో వారికి సరైన ప్రాతినిధ్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ రాజ్య స్థాపనకు డాక్టర్ విశారదన్ మహారాజ్ తలపెట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఆవు నూరి సతీష్, సుద్దాల శంకరయ్య,బచ్చలి రాజయ్య మహారాజ్, కాదాసి రమేష్,మాతంగి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెచ్చేందుకే బిఆర్ఎస్ పార్టీ పుట్టింది..

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ఈ నెల 27 న చలో వరంగల్ సభకు జగిత్యాల నియోజకవర్గంలోనీ ప్రతి గ్రామం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలి అని జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో గురువారం రోజున మీడియా సమావేశం నిర్వహించిన జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం తేవడానికి బి.ఆర్.ఎస్ పార్టీ పుట్టిందని, తెలంగాణను దేశంలోనే అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టిందని, తెలంగాణ కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా పని చేస్తుందని దావ వసంత అన్నారు. రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని 15 ఏండ్లు అలుపెరుగని పోరాటం చేసి సాధించిన గొప్ప నాయకుడు కెసిఆర్ అని, తెలంగాణలో 10 ఏళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన నాయకుడు అని, కాంగ్రెస్ పాలనలో మునుపటి పాత రోజులు తిరిగి వస్తున్నాయని, కెసిఆర్ ప్రభుత్వ హయంలో రైతులకు నాట్ల అప్పుడు రైతు బందు వేస్తే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఓట్ల అప్పుడు మాత్రమే రైతు బంధు వేస్తున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సి జీవన్ రెడ్డి ఒకరికొకరు పరస్పరం విమర్శించుకోకుండా జగిత్యాల అభివృద్ధి క్గోసం పాటుపడాలన్గి అన్నారు. పార్టీ ఏర్పడి 24 సం పూర్తి చేసి 25 సంలోకి అడుగుపెడుతున్నామని, ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు భవిష్యత్ గుర్తించి దిశానిర్దేశం చేయనున్నారని, సభకు తరలి వెళ్లేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. రూరల్ మండలం అధ్యక్షులు ఆనందరావు, పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగారెడ్డి, కమలాకర్ రావు, ఎల్ల రాజన్న, నలువాల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు పూదరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఊషన్నపల్లి పాఠశాలలో పాఠాలు చెప్పిన తహసీల్దార్!



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లిలోని ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం శ్రీరాంపూర్ మండల తహసిల్దార్ పుల్లూరి జగదీశ్వరర్గావు స్గందర్శించారు. తాను రాసిన లిటిల్స్ బాలల (బైలింగ్వల్ తెలుగు, ఇంగ్లీష్) కథల పుస్తకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు అందజేశారు. ఇందులోని కథలను పిల్లల చేత చదివించాలని ఆయన సూ చించారు. అనంతరం తహసీల్దార్ పాఠశాల పిల్లలకు గణితం బోధించారు. చతుర్విధ ప్రక్రియలకు సంబంధించిన లెక్కలు వేస్తూ పిల్లల నుంచి జవాబులు రాబట్టారు. పిల్లలు చక్కగా స్పందించి, సరైన జవాబులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని జగదేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ తహసిల్దార్ జగదీశ్వరర్గావు రాసిన "లిటిల్స్" బాలల (బైలింగ్వల్ తెలుగు, ఇంగ్లీష్) కథల పుస్తకంలో ఆసక్తిని రేకెత్తించే అద్భుతమైన 24 కథలున్నాయని, అవి పిల్లలు సులభంగా చదవడానికి, అర్థం చేసుకోవడానికి ఎంతగానో దోహద పడుతాయన్నారు. ఇందులోని ప్రతి కథ నీతి, మంచి సందేశంతో కూడి ఉందని, ఇంత మంచి పుస్తకాన్ని రాసి, పిల్లలకు అందజేసిన జగదేశ్వర్రావుకు ఈర్ల సమ్మయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, కొంకటి శ్రీవాణి, పిల్లలు పాల్గొన్నారు.

## పోషణ పక్షం ఉత్సవాలు



**ప్రజాపక్షం/బీర్పూర్:** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున సెక్టర్ సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, తల్లులకు పోషకాహారం గరించి ఐరన్ కాల్షియం మిల్లెట్స్ అనుబంధ ఆహారం మొదలగు పోషక ఆహారం వాటి విలువల గురించి తల్లులకు సలహాలు సూచనలు అందజేశారు. గర్భిణీ దశ నుండి వెయ్యి రోజుల వరకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి , ఆరోగ్యం గురించి ఆరోగ్య పరీక్షల గురించి అవగాహన కల్పించారు. విహెచ్ ఎండి కార్యక్రమంలో భాగంగా బాలామృతాన్ని టీచర్ పంపిణీ చేశారు. గర్భిణీలు, బాలింతలు తల్లుల చేత పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. బాలింతల గృహ సందర్శనలు చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సత్య, సోనా, గోదావరి, పద్మ, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, తల్లులు, కిషోర్ బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని వెల్దుర్తి అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ లావణ్య ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం, శిశువులలో ఇన్ఫెక్షన్లను నివరించడానికి చేతులు కడుక్కోవడం, పరిశుభ్రతలపైన తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. వెల్దుర్తి ప్రాథమికోన్నత పాఠశాల కిషోర బాలికలకు, గర్భిణీలకు రక్తహీనత నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. సూపర్వైజర్ లావణ్య, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రజిత, అంగన్వాడీ టీచర్ నీరజ, ఆయా పద్మ , గర్భిణీలు, బాలింతలు, రెండు సంవత్సరాలలోపు పిల్లల తల్లులు, కిషోర్ బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వండి..

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు జారీ కాక అధిక ధరలు వెచ్చించి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లబ్ది దారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మీ సేవ ద్వారా దరఖాస్తు లు స్వీకరించారని, కానీ అధికారంలో ఉన్నంత కాలం ఒక్క లబ్ది దారునికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. 2023 లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం వల్ల ప్రజలు బిఆర్ఎస్ ను ఓడించారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కూడా కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి మరల మీ సేవ ద్వారా లబ్దిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారని పదిహేను నెలలు గడిచినా ఇంతవరకు లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. రేషన్ కార్డులు జారీ కాక లబ్దిదారులు అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, కనుక రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేసి లబ్దిదారుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గులాబీదండు కదం తొక్కాలి.. ఓరుగల్లు దద్దరిల్లాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: గులాబీ దండు కదం తొక్కాలి ...ఓరుగల్లు దద్దరిల్లాలి..కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలి..25 వసంతాల గులాబీ జాతరను విజయవంతం చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా బుధవారం రాత్రి గోదావరిఖని పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్లో రామగుండం నియోజకవర్గం పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అవమానాలు, అవహేళనలుఅన్నిటినీ అధిగమించి తొలి సిఎం కేసీఆర్ నాయకత్వం లో స్వరాష్ట్రాన్ని సాధించి,4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి, సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా ప్రజల వెంటనే ఉంటోందని, తమకు ఓట్లు వేయలేదని ప్రజ లను ఏనాడు పట్టించుకోకుండా ఉండలేదన్నారు. కేసీ ఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేష్, జె.వి. రాజు గోపు అయులయ్య,పాముకుంట్ల భాస్కర్ రమణారెడ్డి కల్వచర్ల కృష్ణవేణి రాకం వేణు కుమ్మరి శ్రీనివాస్ ఉన్నారు.

## రామగుండంలో శ్రీరాముడి శోభాయాత్ర



ప్రజాపక్షం/రామగుండం : ఆబాది రామగుండంలోని పురాతన వామాంకస్థిత శ్రీసీతారాముల వారి దేవాలయంలో ఇటీవల స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ క్రమంలో గురువారం ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. స్వామి వారి కల్యాణం జరిగిన ఐదో రోజున ప్రతిఏటా ఈ శోభాయాత్రను చేపడ్తారు. పురాతన చెక్క రథంపై ఉత్సవ విగ్రహాలతో స్వామి వారి రథయాత్ర వైభవంగా కొనసాగింది. గ్రామ ప్రజలు, శ్రీరామ భక్తులు శోభాయాత్రకు స్వాగతం పలుకుతూ శ్రీసీతారాములస్వామిని దర్శించుకున్నారు.

## బిసిలపై రేవంత్‌రెడ్డి కపట ప్రేమ

ప్రజాపక్షం/కొత్తపల్లి: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిసిలపై కపట ప్రేమ చూపి అన్యాయం చేస్తున్నాడని పూలే ఫ్రంట్ జిల్లా కన్వీనర్ వరాల శ్రీనివాస్ ఆరోపించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ అమలు కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం అసెంబ్లీ ప్రాంగణంలో పెట్టాలని బిఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం తమ ఆరోపణలకు బలం చేకూరుతుందన్నారు. మహనీయులు మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయిల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని డిమాండ్ చేవారు. బిసి కార్పోరేషన్‌కు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం ఒత్తిడి చేసేందుకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్‌లోని బిసి నాయకులు, ఎమ్మెల్యేలు కవితపై అవాకులు చెవాకులు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్‌కు బీసీలపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ ప్రాంగణంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిల విగ్రహాలు పెట్టించాలని డిమాండ్ చేశారు. బిసిలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు.

## మారియమ్మ ఆలయంలో ట్రైనీ ఐపిఎస్ పూజలు



ప్రజాపక్షం/కొత్తపల్లి: మారియమ్మ ఆలయంలో ట్రైనీఐపిఎస్ వసుంధరయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామం ఒడ్డెపల్లిలోని శ్రీమారియమ్మ దేవాలయంలో జరిగిన పొంగళ్ ఉత్సవాల్ల ట్రైనీ ఐపిఎస్ వసుంధర యాదవ్, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి పూజలు చేశారు. ఒడ్డెపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 20న కరీంనగర్ విభాగ్‌స్థాయి గోరక్ష కార్యకర్తల సమావేశం

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం కేంద్రంలో గల శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో మండల గోరక్షాక,విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా విభాగ సమావేశం గురువారం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గోరక్షా ప్రముఖ్ ఇసంపల్లి వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 న మండల కేంద్రంలో జరిగే కరీంనగర్ విభాగ్ స్థాయి గోరక్ష కార్యకర్తల సమావేశము గోఆధారిత వ్యవసాయం పై యువ రైతులకు అవగాహన కల్పించి గోవంశ రక్షణ చేయడానికి ప్రోత్సహించేలా నిర్వహించే కార్యక్రమానికి అఖిలభారత గోరక్ష సహ ప్రముఖ్ శ్రీ ఆకారపు కేశవరాజు విచ్చేయనున్నారాని ఆయన తెలిపారు.గో ఆదరిత వ్యవసాయంతో పాటు గో ఉప ఉత్పత్తులను ప్రతి ఇంటిలో విరివిగా వాడడం వల్ల గో రక్షణ చేసే వారికి ఆర్థికంగా లబ్ధి చేకూరి వారు మరిన్ని ఆవులను పెంచుకునేలాగా ప్రోత్సహించినట్లు అవుతుందని తెలిపారు. అలాగే ప్రతి రైతు కనీసం ఒక ఆవును పెంచుకునేలా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తే గోవంశరక్షణ సులువుగా జరుగుతుందని వారు ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి తెలిపారు. జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, జిల్లా కార్యదర్శి గజం రాజు, జిల్లా గోరక్ష ప్రముఖ్ ఆడెపు నరేష్,మండల గోరక్షాక్ ప్రముఖ్ జంగిలి సత్యం,సహా ప్రముఖ్ కోట తిరుపతి, ప్రసార ప్రముఖ్ సమిండ్ల సత్యం, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేష్ యాదవ్, మండల కన్వీనర్ ఎనగందుల రమేష్,శివ,సాతాల లక్ష్మ ణ్, తిరుపతి , ఉమేష్ యాదవ్ పాల్గొన్నారు.


## 12న హనుమాన్ జయంతి.. దీక్షాపరులకు అన్నప్రసాదం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ పట్టణంలోని కొత్తపల్లి వార్డులో గల తన గెస్ట్ హౌస్‌లో మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి సహకారంతో మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ డి.సంపత్ ఆధ్వర్యంలో ఈ నెల 12న చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నుంచి జయంతి వరకు హనుమాన్ దీక్ష మాలదారులకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కొత్త జయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమాన్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి స్వాములకు స్వయంగా అన్న ప్రసాదం వడ్డించారు. హనుమాన్ దీక్ష మాలదారులకు అన్న ప్రసాద వితరణ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి చిన్నహనుమాన్ జయంతి వరకు అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని, దీనిని హనుమాన్ మాల దీక్ష పరులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. గురువారం సుమారు 300 మంది అంజన్న స్వాములకు అన్న ప్రసాదం అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ డి.సంపత్ మాట్లాడుతూ హనుమాన్ మాల దీక్షపరులకు అన్నదానం చేసేందుకు సంకల్పించి మొదటగా కొత్త జయపాల్ రెడ్డిని సంప్రదించగా వారు వెంటనే అంగీకరించి వారి సహకారం అందించారని, కొత్త జయపాల్ రెడ్డికి ఆ అంజన్న కృపా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వారితో పాటు మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్, అన్నమనేని రాంప్రసాద్‌రావు, ఆది వివేక్, చల్ల హరిశంకర్, అయ్యప్ప మహాపాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు, బిఆర్ఎస్ నాయకులు ఎం.ఏ. కరీంల సహకారంతో ఇక్కడ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా వచ్చే పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జయంతి వేడుకకు 21 రోజుల ముందు నుంచి అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలోకొత్తజయపాల్‌రెడ్డితో పాటు డి.సంపత్, బ్రహ్మం, నల్ల ఆదిరెడ్డి, శ్రీను, విజయ్, శివ, ఎడవెల్లి కుమార్, జయపాలన్న మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## జోరుగా ఇసుక అక్రమ రవాణా..పట్టించుకోని యంత్రాంగం

ప్రజాపక్షం/ముత్తారం : రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్ట రాజ్యాంగ మానేరు వాగు నుండి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. అయినప్పటికీ అధికార యంత్రం మాత్రం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ శివారులోని మానేరు వాగులో మట్టి రోడ్డును వేసి మరి జోరుగా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న అధికారులు మాత్రం అటువైపు చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రీచ్ ల నుండి ఉచితంగా అనుమతి ఉన్న అక్రమ రవాణా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఇటీవలే ముత్తారం మండలంలోని ముత్తారం, అడవి శ్రీరాంపూర్ మానేరు వాగు ఇసుక రీచ్ ల నుండి ఉచితంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకునేందుకు అవకాశం కల్పించారు. అయినప్పటికీఅనుమతి ఉన్న రీచ్ ల వద్ద నుండి ఇసుక తీసుకోకుండా అక్రమంగా అనుమతి లేని పారుపల్లి గ్రామ మానేరు వాగు నుండి ఇసుకను ఇష్ట రాజ్యాంగ అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతి లేకుం డా ఇసుకను తరలిస్తున్న వారిపై అధికారి యంత్రాంగం దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామంలో చేపడ్తున్న ఉపాధి హామీ ఫామ్‌పాండ్ పనులను డీఆర్‌డీవో కాళిందిని గురువారం తనిఖీ చేశారు. కూలీలకు అందిస్తున్న వేతనాలు, పండ్ల తోటల పెంపకం, ఇన్సురెన్స్ గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎమ్పీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన పనులను పర్యవేక్షించారు. అనంతరం పెద్దంపేట గ్రామంలో మహిళల కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. డీఆర్‌డీవో వెంట ఎమ్పీడీవో బి.వేణుమాధవ్, పర్యవేక్షణాధికారి ఎం.కరుణాకర్, ఏపీవో టి.రమేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మట్టి తరలింపునకు పకడ్బందీ మార్గదర్శకాలు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :జిల్లాలో ఇతర వాణిజ్య అవసరాలకు మట్టి తరలింపు కోసం పగడ్బందీ మార్గదర్శకాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మట్టి తరలింపు విధివిధానాల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరుల నుంచి మట్టి తరలింపుకు పకడ్బందీ విధానం తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వాణిజ్య అవసరాలు గమనిస్తూనే పర్యావరణాన్ని సంరక్షించే విధంగా పాలసీ రూపకల్పన ఉండాలని, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, మైనింగ్ అధికారులు, సమన్వయంతో అందరికీ ఉపయోగపడే విధంగా పాలసీ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు.డిసిపి కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, ఉప సంచాలకులు మైనింగ్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసిపి రమేష్, కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు ప్రకాష్, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## విమల రణధీవే ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కమ్యూనిస్టు యోధురాలు, స్వాతం త్ర ఉద్యమంలో అలుపెరుగని కృషి చేసిన కామ్రేడ్ విమల రణధీవే జయంతి పురస్కరించుకుని సిఐటియు కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్‌లు మాట్లాడుతూ 13 సంవత్సరాల వయస్సులోనే జాతీయ ఉద్యమం పట్ల ఆకర్షితులై సేవాదళ్ వాలంటీర్‌గా పనిచేశారని, గాంధీజీ పిలుపుమేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. బ్రిటీష్ పాలకులకు బెదరకుండా ఎదురొడ్డి పోరాడి జైలు జీవితం గడిపారన్నారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి ఎస్‌జి సర్దేశాయ్‌కు విమలతన దగ్గరి బంధువు కావడంతో కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులై కార్మిక వర్గం, పీడిత ప్రజల కోసం వర్గ పోరాటం సిద్ధాంత మార్గంలో ఉద్యమించారన్నారు. విప్లవ జీవితంలో రాజీలేని పోరాటం చేసిన వారి ఆశయాలను కొసాగిస్తామని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోట్లను రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనాలు అమలు చేయాలని మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు పద్మలత, లక్ష్మి, సుజాత, సరిత, లలిత, రజియా పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో మోడీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/గోదావరిఖని : రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుండగా, అదనంగా మరో కిలో బియ్యాన్ని ఇస్తూ తామే మొత్తం 6 కిలోల బియ్యం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తున్నదని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ పిడుగు కృష్ణ ముదిరాజ్ అన్నారు. గురువారం గోదావరిఖని 10వ డివిజన్ శ్రీరాంనగర్‌లోని రేషన్ షాప్ దుకాణాలను వారు సందర్శించారు. సన్న బియ్యం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు.బిజెపి నాయకులు జక్కుల నరహరి, గోగుల రవీందర్‌రెడ్డి, పంగ రవి, బుంగ మహేష్, మామిడి వీరేశంలు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత సింగరేణిగా మార్చాలి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి రామగుండం రీజియన్ రక్షణ అవగాహన సదస్సును గోదావరిఖనిలోని ఆర్జీ1 ఏరియా కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించారు. సింగరేణి డైరక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎన్.నాగేశ్వర్‌రావు, డిప్యూటి డైరక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ బానోతు వెంకన్న, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్, ఆర్జీ3 జీఎం ఎన్.సుధాకర్‌రావు, జీఎం ఎపీఏ నాగేశ్వర్‌రావు, రేస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ2 ఇన్‌ఛార్జి జీఎం రాముడు, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కె.హెచ్.ఎన్.గుప్తాలు ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. గనులలో రక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గనులపై, పని ప్రదేశాల్లో రక్షణ స్లొగన్స్ ఏర్పాటు చేయాలన్నారు. భూగర్భ గనులలో తాగునీరు, రెస్ట్ షెల్టర్స్, ఫస్ట్ ఎయిడ్ షెల్టర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రిజల్ట్ ఓరియంట్ ఇన్స్‌పెక్షన్ అండ్ సెల్ఫ్ రెగ్యులేషన్ అమలు పరచాలన్నారు. రూఫ్ ఫాల్ కాకుండా స్టాట కంట్రోల్ చాలా ముఖ్యమైనదన్నారు. దీనిని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూఫ్‌లను కింద పడకుండా జాగ్రత్తగా కాపాడాలని, అలాగే సైంటిఫిక్ స్టడి చేస్తూ ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఇన్ ద్యూస్ బ్లాస్టింగ్‌లో తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సపోర్టు ప్లాన్‌ను నిరంతరం పరిశీలిస్తూ, రూఫ్ సపోర్టును నిరంతరం పై అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్లు చిలక శ్రీనివాస్, రమేష్, అధికారులు సాయిప్రసాద్, నెహ్రూ, మల్లేశం, రమేష్‌కుమార్, రామగుండం రీజియన్ సేఫ్టీ అధికారులు, వివిధ గనుల మేనేజర్లు, రక్షణఅధికారులు వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## పిఎంశ్రీ ఎంపిపిఎస్ పాఠశాలలో వార్షికోత్సవం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం రోజున వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్విహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యాధికారి టి. శ్రీనివాస్ హజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, పీఎంశ్రీ సపోర్ట్ ద్వారా వీర్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు అమలవుతున్నాయని అన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో తల్లి దండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. చిన్నారులు వివిధ వేశాధారణలతో చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం ఉదయలక్ష్మి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ ఎంపిటీసీ అరుణ్ కుమార్, ఎఎపిసీ చైర్మన్ కె స్వర్ణలత,ఉపాధ్యాయులు లావణ్య, రజిత, ప్రవీణ, మౌనిక, మనోజ్ కుమార్, పద్మ, గంగశ్రీ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను సీపీఐ(ఎంఎల్‌మాస్‌లైన్) ప్రజాపంథా నాయకులు గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వంటగ్యాస్ ధరలు కూడ రూ.50 పెంచడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారన్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన డిజీల్, పెట్రోల్ ధరలను మాత్రం తగ్గించడంలేదన్నారు. అధిక ధరలకు తోడు జీఎస్టీల పేరిటా పన్నులు ఇష్టానుసారంగా వసూలు చేస్తూ పేద ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. వెంటనే పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పెండ్యాల రమేష్, గొల్లపల్లి చంద్రన్న, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, తీగుట్ల రాములు, మార్త రాధక్క, రాజన్న మల్లన్న, శంకరన్నలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు నిలిపివేత

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని బసంత్‌నగర్, జీడీ నగర్ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 830 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ బసంత్‌నగర్ ఎఈ ఎం.ప్రసాద్ తెలిపారు. బసంత్‌నగర్‌లో 11 కెవి ఫీడర్ విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడ్తున్నందున విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## సోలార్ వీధి దీపాలు

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం ఎన్‌టిపిసి ప్రభావిత గ్రామమైన మల్యాలపల్లిలో ఎన్‌టిపిసి సీఎస్సార్ ఆధ్వర్యంలో 18 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ 20వ డివిజన్ అధ్యక్షుడు సిరిశెట్టి సతీష్‌గౌడ్ తెలిపారు. 15 సింగిల్ లైట్లు, మూడు రింగ్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోలార్ దీపాలను ఏర్పాటు చేసేందుకు సహకరించిన రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, ఎన్‌టిపిసి సీఎస్సార్ అధికారులకు మల్యాలపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుడు అరెస్టు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి డిసిపి పి కరుణాకర్ తెలిపారు. గురువారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో గంజాయి విక్రయిస్తున్న పెద్దపల్లి పట్టణం బండారి కుంట ప్రాంతానికి చెందిన షేక్ ఆసిఫ్ అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జల్సాలకు అలవాటు పడి గంజాయి అమ్మడం వ్యాపారం గా మలుచుకొని అమాయక యువతను గంజా మత్తుకు బానిసలను చేస్తూ పలుకేసులలో నిందుతుడు అయిన షేక్ ఆసిఫ్ అరెస్టు చేసి అతని వద్ద నుండి ఎండు గంజాయి,ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, సెల్ ఫోన్ , బైక్. స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు ఆటో నడుపుకుంటూ వచ్చిన డబ్బులు తన అవసరాలకు, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బుల సంపదిచాలనే ఉద్దేశంతో, గత కొన్ని సంవత్సరాలు గా మహారాష్ట మరియు వివిధ ప్రాంతాల నుండి తక్కువ ధరకు గంజాయిని కొని అవసరమైన వారికి ఎక్కువ ధరలకు అమ్మడం, దొంగతనాలకు పాల్పడటం అలవాటుగ చేసుకొన్నాడని,పలుమార్లుపోలీసులు పట్టుకొని 2016, 2018, 2019, 2021, 2024లలో (8) కేసులు నమోదు అయ్యాయని, పిడి యాక్ట్ కూడా పెట్టిడమయినదని,పెద్దపల్లిలో 2024లో షేక్ శాబాస్ కు గంజాయి అమ్మగా అతనిపై కేసు అయిందని, పెద్దపల్లి పోలీస్ వారు ఇక్కడ అతనిపై నిఘా ఎక్కువ పెట్టడంతో తో ఇక్కడి నుండి మొగ్ధుంపూర్ కు వెళ్ళి అక్కడే ఇల్లు కిరాయికి తీసుకోని ఉంటూ కరీంనగర్ చుట్టూ పక్కల ఆటో నడుపుతూ, గంజాయి అమ్ముతూ వచ్చిన డబ్బులు తన అవసరాలకు వాడుతున్నాడని, అలా గత కోతకాలం నుండి నాగపూర్‌లో ఉండే సల్మాన్ నుండి గంజాయిని కొనుక్కోనివచ్చి గ్రామాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని,ఆదే విధంగా గంజాయి కోసం గత నెల 30 న పెద్దపల్లి రైల్వే స్టేషన్ నుండి ట్రైన్ లో నాగపూర్ కు వెళ్ళి యధావిధిగా సల్మాన్ వద్ద 16000 రూపాయలకు కిలో చొప్పున 4కిలోట గంజాయిని కొని అమ్ముతున్నాడని, అతడిని గంజాయి తో సహా పట్టుకోవడం జరిగిందని తెలిపారు.నేరస్తుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లిసిఐకె.ప్రవీణ్‌కుమార్,పెద్దపల్లి ఎస్ఐ జె.లక్ష్మణ్ రావు, మల్లేశం, సిబ్బంది హెచ్‌సి రమేష్, కానిస్టేబుల్స్ కె.ప్రభాకర్, కె. సతీష్, ఎన్.రాజు, ఎం. అనిల్ కుమార్లను అభినందించారు.

## ఎరువుల విత్తనాల బాధ్యతలు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలో ప్రభుత్వం ద్వారా విక్రయించే ఎరువులు విత్తనాల దుకాణాలను మహిళ సంఘాలకు ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయ ప్రత్యేక అధికారి అబ్దుల్‌బేగం ,ఎపియం మల్లేషం తెలిపారు.గురువారం వారు మాట్లాడుతూ కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో మండల కేంద్రంతో పాటుగా కోరుట్లపేట గ్రామాల వీవో,సీఏ లతో సమావేశమయ్యారు.ఎరువులు విత్తనాల షాపులను వీవోలకు మంజూరు చేస్తున్నట్లుగా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామలలో గోడౌన్ సౌకర్యం,షాపుల నిర్వహణకు లైసెన్సులను అప్లై చేసుకోవాలని సూచించారు. అందరూ సహకరించాలన్నారు. ఐకేపి మల్లేషం, వ్యవసాయ అధికారి రాజశేఖర్, సీసీలు, వీవోలు నాగరాజు, సుధాకర్ ఉన్నారు.

## రుద్రంగిలో సిపిఐ గ్రామ శాఖల సమావేశం విజయవంతం

**ప్రజాపక్షం / రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండలంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖల సమావేశం సిపిఐ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సిపిఐ పార్టీ తరుపున సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలుగా సిపిఐ అభ్యర్థులు పోటీలు ఉంటారని అన్నారు. రుద్రంగి ఊరి చుట్టు పంట కాలువలు ఉన్నప్పటికి రైతులకు పంట టైంలో పొలాలకు నీరు అందేలా చూడాలని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అర్హులైనటువంటి పేదలకు స్థలం ఇచ్చి 5లక్షల 50 వేల లోన్ ఇవ్వాలని కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత జిఎస్‌టి పేరుతో నిత్యవసరాల ధరలు పెంచి పేదల కడుపు కొడుతుందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర 50 పెంచి జిల్లాలో 5కోట్ల రూపాయల భారం ప్రజల పైన మోపిందన్నారు. ప్రజాపోరాటాలు తప్పవని తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్డు డ్రైనేజిలు పూర్తి చేయాలని, కోనో కార్పస్ చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రుద్రంగి శాఖ కార్యదర్శి కోల రెడ్డి, సహాయ కార్యదర్శి రాగుల మల్లేశం, రెండవ శాఖ కార్యదర్శి దరిపెల్లి భూమయ్య, సహాయ కార్యదర్శి గండి గంగాధర్, సిపిఐ పార్టీ కార్యదర్శులుగా సహాయ కార్యదర్శులుగా ఎన్నికైయ్యారని సిపిఐ శ్రేణులు పాల్గొన్నారని తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్తు, ఎరువులు అందజేత

**ప్రజాపక్షం/ రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ పాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఎరువులు మేలైనా వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో 21వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని వెల్లడించారు. సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సాహించాలని ఉద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు బోనస్‌గా రూ.లు 500 ఇస్తుందని తెలిపారు. రేషన్‌దుకాణాల్లో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. సన్న బియ్యంపంపిణీపై బిజెపి రాజకీయం చేస్తుందని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, పాక్స్ డైరెక్టర్ కసిరెడ్డి నర్సారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, బిసి సెల్ అధ్యక్షుడు గండి నారాయణ, తర్రె మనోహర్, గడ్డం స్వామి, తర్రె లింగం, గడ్డం శ్రీనివాస్, పల్లి గంగాధర్, గండి అశోక్, ఎర్రం గంగనర్సయ్యఉన్నారు.

## చెట్లు తొలగింపు

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని పోతారం గ్రామం నుండి గోదావరిఖని వెళ్లే ప్రధాన రహదారి ఎస్సారెస్పీ కెనాల్ మూల మలుపు వద్ద ఉన్న పిచ్చిచెట్లు, ముళ్లకంపలు దట్టంగా పెరిగిపోయి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా మారాయి. దీంతో మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ యాదవ్ స్పందించి జెసిబి సహాయంతో రోడ్డుపైకి చెట్ల కొమ్మలు తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని. తరచూ పలుసార్లు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వ్యాపించడంతో వాహనదారులకు దారి కనిపించక ఇటు వాహనదారులు, అటు ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని రోడ్డుకు ఇరువైపులా రహదారిపై వ్యాపించి ఉన్న పిచ్చి మొక్కలను, ముండ్ల చెట్ల కొమ్మలను జెసిబి సహాయంతో తొలగించడం జరిగిందన్నారు. కాగా రహదారికి అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు కృషిచేసిన మాజీ సర్పంచి మహేందర్ యాదవ్ ని వాహనదారులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి 'గావ్ ఛలో' విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తలు, క్రియాశీల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. బిజెపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'గావ్ ఛలోబస్తి ఛలో' కార్యక్రమం విజయవంతం చేయాలని సుభాష్ కోరారు. కార్యకర్తల కృషి వల్లనే ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ఇదేవిధంగా పనిచేయాలన్నారు. 6 గ్యారంటీల పేరిటా రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ప్రజల్లో ఆ పార్టీ పట్ల నమ్మకం పోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపుకు కృషి చేయాలన్నారు. బిజెపి నాయకులు బాలసాని సత్యంగౌడ్, మాడ అనిల్‌రెడ్డి, కందుల సత్తయ్య, తమ్మనవేణి మల్లేష్, కొల్లూరి లక్ష్మణ్, లగిశెట్టి తిరుపతి, శాఖపురం కుమార్, పసుల రాజశేఖర్, మిడివెల్లి అంజి, ఆవుల విజయ్‌పాల్, గద్దల మహేష్, మాడ ప్రభాకర్‌రెడ్డి, బదావత్ అనిల్‌నాయక్, కొల్లూరి శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## 19 నుండి కార్మికుల సమ్మె

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కొరకై ఈ నెల 19 నుండి సమ్మె నిర్వహిస్తామని ఇంచార్జి ఎంపీడీవో వాజిద్‌కు గురువారం రోజున నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ట్రెజర్‌లో 2024 జూలై నుండి డిసెంబర్ వరకు ఉన్న బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు న్యాత నర్సయ్య, కార్యదర్వి వినీత్, నాయకులు నర్సవ్వ, పూజా, నాగేష్, శ్రీను, సురేష్, తిరుపతి తదితరులు పాల్గోన్నారు.

## 14న అంబేడ్కర్ జయంతి

**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో ఈనెల 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇండిబెల్లి రవీందర్‌కుమార్ తెలిపారు. సంఘం నాయకులు మున్నూరు నాగమయ్య, కాంపల్లి నర్సయ్య, సాధనాల మోహనరావు, మురుగేషన్ రాజేష్ ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహావీర్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** మహావీర్ జయంతి వేడుకలను జైనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహావీర్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల గుండా జైనులు మహావీర్ చిత్రపటంతో శోభయాత్ర నిర్వహించారు. మహిళలు పాటలు పాడుతూ కోలాటాలు, దాండియా ఆడారు. ఈ కార్యక్రమంలో జైనులు మనీష్, నవీన్, వినోద్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండల పరిధిలోని రిక్షా కాలనీ ప్రభుత్వ మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు మేరాజ్ అహ్మద్ ఖాన్, జాకియా సుల్తానా ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామాగ్రిని పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ హాజరై వారి చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో మంచిగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. మండల ప్రాంతాల్లో విద్యనభ్యసించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేర్ ఆబిద్ అలీ, మహేష్, సిఆర్‌పి అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన గుండాల అంజన్నకు మంజూనైన రూ. 12000 విలువల గల సిఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం బిజెపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు లబ్దిదారుడికి ఇంటికి వెళ్లి చెక్కు అందజేసినట్లు తెలిపారు. ఎంఎల్ఎ కృషితో సిఎం రిలీఫ్ చెక్కు రావడం సంతోషంగా ఉందని లబ్దిదారుడు గుండాల అంజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పుల్ల అశోక్, రావుల నరేష్,నూనె సంపత్‌కుమార్, లెండుగురె ఆనంద్, రామలింగు, హర్షద్, నాందేవ్, ఓం ప్రకాష్, తదితరులు నాల్గొన్నారు.

## లక్ష్మణచందా ఎస్సైగా రెహమాన్ మాలిక్ నియామకం..

**ప్రజాపక్షం/లక్ష్మణచందా:** లక్ష్మణచందా నూతన ఎస్సైగా రెహమాన్ మాలిక్ గురువారం బాధ్యతలు చేపట్టారు.ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై సుమలత నిర్మల్ లోని భరోసా కేంద్రానికి బదిలీ పై వెళ్లారు.ఆమె స్థానంలో బైంసా రూరల్ ఎస్సైగా పనిచేసిన రెహమాన్ మాలిక్ లక్ష్మణచందా ఎస్సైగా నియామక బాధ్యతలు తీసుకున్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ హయంలో దేశం అగ్రగామి

**ప్రజాపక్షం/బైంసా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాయంలో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ అన్నారు.గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని బైంసా మండల బిజెపి క్రియాశీల సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.370 ఆర్టికల్,వక్ బోర్డు సవరణ చట్టం,సి.ఎ.ఎ.ఎన్.ఆర్.సి.తో పాటు పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచంలోనే అభివృద్ధిలో దేశం ఐదవ స్థానానికి వచ్చిందంటే అది మోది ఘనతేనన్నారు.స్వాతంత్ర దినోత్సవ శతాబ్ది ఉత్సవాలు 2047 వరకు ప్రపంచాన్ని విశ్వ గురువుగా భారత్ నిలిచేలా ముందుకు సాగుతామన్నారు.బిజెపి కార్యకర్తలు గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.కొన్ని దుష్టశక్తులు రాజ్యాంగ మారుస్తారంటూ బిజెపి పై విమర్శలు చేయడం సరికాదన్నారు.రాజ్యాంగానికి కట్టుబడి బిజెపి ఉంటుందని,అంబేద్కర్ జయంతి వరకు ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాల సాధనే బిజెపి ధ్యేయమన్నారు.కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి,లోకేశ్వరం మండల బిజెపి అధ్యక్షులు సాయన్న,మాజీ ఆత్మ చైర్మన్ రవీందర్ రావ్,మాజీ పి.ఎ.సి.ఎస్.చైర్మన్ డి.శ్రీనివాస్,వన్ నేషన్ వన్ ఎలక్షన్ బైంసా మండల ప్రోగ్రాం కన్వీనర్ సాయినాథ్,నాయకులు సుభాష్,బాలాజీ పటేల్,దేవిదాస్,భోజరాం పటేల్,పోల్కం సాయినాథ్,లింగన్న తదితరులు పాల్గొన్నారు.



## అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/కాసిపేట:** కాసిపేట మండలంలోని సోమగూడెం, లంబడితండా, కాసిపేట గ్రామాల్లోని అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలను బుధవారం రాత్రి మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, జిల్లా వయోజన విద్యాధికారి, కాసిపేట మండల స్పెషల్ ఆఫీసర్ ఎ. పురుషోత్తంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వాలంటీర్లను అభ్యాసకుల యొక్క అభ్యాసన ప్రగతిని అడిగి తెలుసుకుని అభ్యాసకుల అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. అభ్యాసకులచే చదివించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ చదువుకు వయసు అడ్డు రాదని, అందరూ తప్పక చదువుకోవాలని, చదువుకుంటే తమ పిల్లల విద్యా ప్రగతిని పరిశీలించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని, నిత్యవసరాలకు ఎవరి మీద ఆధారపడకుండా స్వయంగా పనులు చేసుకోవచ్చని అని తెలియజేశారు. అనంతరం మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తం మాట్లాడుతూ కాసిపేట మండలం త్వరలోనే 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం గ్రామాల్లోని తాగునీటి, డ్రైనేజి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇల్లు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ చౌదరి సత్యనారాయణ మూర్తి, డీఆర్‌పిలు బండ శాంకరి, కొండ జనార్ధన్, సుమన్, ఇన్స్పెక్టర్ రాజేశ్వరి, లావణ్య, విజయ లక్ష్మి , అభ్యాసకులు, తదితరులు పాల్గొన్నారు.



## గుప్పెడు బియ్యంతో నిరుపేదకు తోడుగా విద్యార్థుల ఔదార్యం..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు 4 రోజుల పాటు తెచ్చిన గుప్పెడు బియ్యాన్ని సంచిలో జమ చేసి ఖానాపూర్ కు చెందిన నిరుపేద బొమ్మరేని నర్సయ్య కు గురువారం అందజేశారు.4 రోజుల పాటు విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు గుప్పెడు బియ్యాన్ని తెచ్చి సంచిలో జమచేశారు.దీంతో పాటు 500 రూపాయలను కూడా జమ చేసి రోజువారికి అవసరం అయిన కూరగాయలను కూడా అందచేసి,సాటి వారి కష్టానికి కొంత సహాయం చేసి వారి ఆపదను తీర్చుతూ ఆదర్శంగా నిలిచారు.నెల క్రితం జమ చేసిన 30 కిలోల బియ్యాన్ని వెయ్యి రూపాయలను నిరుపేద ఖలీల్ కుటుంబానికి ఇటీవల అందచేసారు.ఇప్పుడు మళ్ళీ ఇంకో పేద కుటుంబానికి సహాయం చేసారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పరోపకార గుణం,మానవత్వం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం జరపుతున్నామని,ఆ దిశగా విద్యార్థులు ముందుకు వస్తున్నారని ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య,జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్ ఫరాజ్ అహ్మద్, శోభారాణి, కిషన్ ప్రసాద్, విజయ్ కుమార్, షఫీ, రవి, చందన, లక్ష్మణ్ రావు, స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



## బాన్సువాడలో ఈనెల 17 నుండి బేతాళ స్వామి జాతర

**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో ఈనెల 17 నుండి 19వ తేదీ వరకు బేతాళ స్వామి జాతరను ఘనంగా నిర్వహించనున్నట్టు జాతర కమిటి ప్రతినిధులు తెలిపారు. గురువారం బాన్సువాడ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్‌తోకలిసి జాతర కమిటి ప్రతినిదులు సమావేశమై జాతర ఏర్పాట్లపై చర్చించారు. 17వ తేదీన జాతర ప్రారంభమై అదేరోజుసాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు, 18న జూనియర్ కళాశాల ప్రాంగణంలో కుస్తీ పోటీలు నిర్వహించి 19వ తేదీన జాతర ముగింపు కార్యక్రమం ఉంటుందని, జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కమిటి ప్రతినిదులు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, గ్రామ పెద్దలు మాసాని శ్రీనివాస్ రెడ్డి, నార్ల రవిందర్, పోతు రెడ్డి, మాసాని రవిందర్ రెడ్డి, మునిసిపల్ మేనేజర్ మల్లికార్జున్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## ఈనెల 15న బాన్సువాడ రానున్న కవిత, బాజిరెడ్డి గోవర్దన్





**ప్రజాపక్షం / బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించే బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఈనెల 15న రాష్ట్ర నాయకురాలు ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరుకానున్నట్టు మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మెంగారం భీమయ్య ఈ మద్యకాలంలో మరణించారు. విషయం తెలుసుకున్న పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ గురువారం భీమయ్య నివాసానికి వెళ్ళి ఆయన చిత్రపఠానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఏ సమయంలో అయినా ఎలాంటి సమస్య ఎదురైనా తమకు తెలియజేయాలని, సమస్యను తాము దగ్గరుండి పరిష్కరిస్తామని వారి కుటుంబ సభ్యులకు ధీమానిచ్చారు. వారి వెంట ప్రజాపండరి, గుర్రపు శ్రీనివాస్, మెంగారం శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.



## గోర్గల్‌లో హరినామ సప్తహా

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని గోర్గల్ గ్రామంలో గల విఠలేశ్వర ఆలయంలో వార్కారీ భక్తులు, మహారాజ్‌లు గురువారం అఖండ హరినామ సప్తహాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీనా విఠల్ రుక్మిణిల కళ్యాణ మహోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు హరినామ సప్తహా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 17వ తేదీనా గోపాలకాలువలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా నిత్య పూజలు, హరిపాఠల్, తదితర కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్కారీ భక్తులు, మాలాధరులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## చిన్నారులకు రక్తహీనత శిబిరం

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు గురువారం నాడు కంటి వైద్య శిబిరం, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాన్సువాడ ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ అర్జున్ చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సీడీపీఓ సౌభాగ్య, రేణుక, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు ప్రవీణ, సుమలత, రాధ, శోభ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 20 నుంచి ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 20 నుండి ప్రారంభం కానున్నట్లు జడ్‌పిఎస్‌ఎస్ బాలుర కాగజ్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమీల, కోఆర్డినేటర్ సాయిని సత్యనారాయణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 2.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు తమ తమ హాల్‌టికెట్లను తీసుకెళ్లాలని వారు సూచించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

**ప్రజాపక్షం / ఆర్మూర్:** మండలం మంథని, ఇబ్రాన్ పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామాలతోపాటు మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ధాన్యం తూకంలో ఏమైనా తేడాలు ఉంటున్నాయా అని ప్రశ్నించగా, ఒక్కో బస్తాకు 41.5 కిలోల చొప్పున తూకం జరుపుతున్నారని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిలువ చేసిన ధాన్యం రాశులను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. గ్రెయిన్ క్యాలిపర్ ద్వారా నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా సన్న ధాన్యం ఉందా లేదా అని కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపారు. మంథని గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న ధాన్యం అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. బాగా ఆరబెట్టి, శుభ్రపరిచిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని, సన్న ధాన్యానికి అదనంగా క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని గుర్తుచేశారు. ఇసుక, మట్టి బెడ్డలు, సేంద్రీయ పదార్థాలు, పొట్టు, తాలు, గింజలు వంటివి లేకుండా తేమ 17 శాతానికి మించకుండా ఎఫ్ఏ క్యూ ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా పూర్తిస్థాయిలో రైతులకు మద్దతు ధర అందడమే కాకుండా, రైస్ మిల్లుల వద్ద కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని కలెక్టర్ హితవు పలికారు. కాగా కొనుగోలు కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను సరిపడ అందుబాటులో ఉంచాలని అన్నారు. అకాల వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నందున రైతుల నుండి వేగవంతంగా ధాన్యంసేకరిస్తూ, వెంటది వెంట నిర్దేశించిన రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. సన్నాలు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తున్నందున గత సీజన్‌తో పోలిస్తే ఈసారియాసంగిలో 80 శాతానికి పైగా సన్న రకం ధాన్యం పండించారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్ళు వేగవంతం చేస్తు, నిర్దిష్ట గడువుకు ముందే ధాన్యం సేకరణ ప్రక్రియ



పూర్తిచేసేలా ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటది వెంట బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల నుండి ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు తెప్పించుకొని ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. రైతుల నుండి ధాన్యం కొన్న వెంటనే వారికి పూర్తి వివరాలతో కూడిన రశీదును తప్పనిసరిగా అందించాలని, ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత రిజిష్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి డిఆర్‌డిఓ సాయాగౌడ్, ఆర్‌డిఓ రాజాగౌడ్, డిసిఓ ఎన్.శ్రీనివాస్ రావు, డిఎస్‌ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నిరుపేదలకు సిఎం సహాయనిధి..

**ప్రజాపక్షం/ముధోల్ :** సీఎం సహాయ నిధి పథకం నిరుపేదలకు అండగా నిలుస్తోందని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి అన్నారు.గురువారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామానికి చెందిన షేక్ హీనా అనే లబ్ధిదారుకి 1,40,000 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం ప్రజా దిశా నిర్దేశంతో ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడించారు.రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉందని తలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తరోడ గ్రామ మాజీ సర్పంచ్ ఆరిఫోద్దీన్,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని పిప్రీ గ్రామంలో బుధవారం కళాజాత బృందం ఆధ్వర్యంలో చెట్లు మూఢనమ్మకాలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు.చెట్లను అధికంగా పెంచడంతో భూమిపై వేడిని తగ్గించవచ్చని పాటల రూపంలో వివరించారు.అనంతరం మూఢనమ్మకాలపై మిమిక్రీ పాటల రూపంలో అవగాహన కల్పించారు.అనారోగ్యం కలిగినప్పుడు ఆసుపత్రిని సంప్రదించాలి కానీ భూతాలు దయ్యాలు అనుకుంటూ ప్రాణాల మీదకి తీసుకోకూడదని మూఢనమ్మకాలను అస్సలు నమ్మకండి అని కళాకారులు తెలియజేశారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపిడిఓ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని కిస్టాపూర్ గ్రామంలోని ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రమేష్,ఎంపీఓ సోలమన్ రాజ్ ఏపీఓ జగన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలు ఉదయం తొందరగా రావాలని పనుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత కొలతలను పరిశీలించారు.పని ప్రదేశంలో నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు తెలియజేశారు.అలాగే ఉపాధి కూలీలు మరింత పెరిగేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు.అలాగే బాగాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు వడదెబ్బ తగలకండా చూడండి..

**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని పాడి రైతులు పశువులకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్,గురువారం రైతులకు పలు సూచనలు చేశారు.ముఖ్యంగా రోజురాజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఎండ వేడిమి వల్ల పశువులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని అందువల్ల మానవుల ఆరోగ్యం విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నామో పశువులకు కూడా అటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా పశు సంపదను కాపాడుకోవాలని తద్వారా పశు సంపదను కాపాడుకోవాలని ఆయన అన్నారు.వడదెబ్బ తదిలినట్టు యితే స్థానిక పశు వైద్య ఆసుపత్రిని సిబ్బందిని సంప్రదించాలని ఆయన అన్నారు.

## వర్షంతో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు.. ట్రాన్స్ ఫార్మర్లు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఆయా మండలాల్లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం భీభత్సం సృష్టించింది. ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో గాలివానతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ స్తంబాలు విరిగిపడగా, ట్రాన్స్ ఫార్మర్లు సైతం కింద పడిపోయాయి. గ్రామంలో కొన్ని చోట్ల కూలిన ట్రాన్స్ ఫార్మర్లు ఇండ్లపై ఒరిగాయి. అంతేగాకుండా, పెద్ద పెద్ద చెట్లు సైతం విరిగిపడ్డాయి. విపరీతంగా గాలి వీయడంతో ముందుగానే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోలేదు.

## మహిళను ఢీకొన్న గుర్తు తెలియని ఆటో



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని బాపునగర్ గ్రామ శివారులో వాగు వద్ద గురువారం రాత్రి ఓ మహిళను ఆటో ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపునగర్ గ్రామ శివారులో బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారిపై గల వాగు బ్రిడ్జి వద్ద నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని ఓ ఆటో ముందుకు నడుస్తూ వెళ్తున్న గుర్తు తెలియని మహిళను ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో కింద పడితలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే ఆమెను నిజామాబాద్ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు.

## బాలసాహిత్య కథల పోటీలలో ప్రతిభ చాటిన జిల్లా విద్యార్థులు


**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** మాచిరాజు సీతారామయ్య రత్నకుమారి దంపతులు స్మారక బడిపిల్లల కథల పోటీలు గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. మొత్తం 541 కథలు రాగా అందులో ఎంపికైన కథలకు బహుమతులు ప్రదానం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ నుంచి విజయ్ హైస్కూల్ 6వ తరగతి చదువుతున్న ఎం. సాన్వికి మూడవ బహుమతి ప్రోత్సాహక బహుమతులతో విద్యా హైస్కూల్ పోలీస్ క్యాంప్ డిచ్‌పల్లి ఎం.సాత్విక్ ఏర్గట్ల జడ్పీ హెచ్ఎస్‌కు చెందిన వి.రూపక్ బాచన్‌పల్లికి చెందిన రావుట్ల లిఖిత, నీల జడ్పీహెచ్ ఎస్‌కు చెందిన నాగం నవ్యశ్రీ విజేతలుగా నిలిచారు. వీరిని ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక రచయితలు, పాఠశాల ఉపాధ్యాయులు సాహితీవేత్తలు అభినందించారు.

## విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

**ప్రజాపక్షం/ముధోల్:** మండల కేంద్రమైన ముధోల్‌లోని పూలే చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఆదర్శ దంపతులైన మహాత్మ జ్యోతిరావు పూలేసావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విగ్రహాల కమిటీ సభ్యులు పలువురు ఒక ప్రకటనలో కోరారు.జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నామని తెలిపారు.కుల మతాలకు తేడా లేకుండా న్యాయం,సమానత్వం కోసం పోరాడిన మహనీయ దంపతుల విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.మహనీయులకు ఆదర్శులు పూలే దంపతులని తెలిపారు.విజ్ఞానమే తమ జీవితానికి ఉన్నతమైన మార్గం చూపగలదని ప్రతి ఒక్కరికీ విద్యా అవసరం చాటి చెప్పిన మహా ఆదర్శులు ఆ దంపతులని అన్నారు.ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తడబడకుండా ప్రతి ఒక్కరూ విద్య నేర్చుకునేలా ప్రోత్సహించిన గొప్ప చరిత్రకారులని వెల్లడించారు.అందరూ ఏకమై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

## ఎడపల్లి మండలంలో భారీగా కురిసిన వర్షం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గత నెల రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడు వైరైటీగా ఎండకాలం ప్రారంభంలోనే అకారణంగా అకాల వర్షాలు ఎంట్రీ ఇచ్చాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో పలు గ్రామాల్లో కురిసిన ఈ అకాల వర్షాలతో రైతులు బెంబెలెత్తిపోతున్నారు. ఉదయం ఉక్కపోతతో ఎండగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశమంత మేఘావృతమై ఉండటంతో వాతావరణం చల్లగా మారింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన భారీ వర్షానికి రైతుల్లో ఆందోళన నెలకొంది. కొంతమంది తమ ధాన్యాన్ని నూర్పిడి చేసి ఆరబెట్టుకోగా ధాన్యం తడిసి ముద్దయింది. మరికొంతమంది రైతులకు సంబంధించిన వరి పంట మరోవారం రోజుల్లో కోతకు రాగా ఈ అకాల వర్షం కారణంగా పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే బాపునగర్ గ్రామంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఇదిలా ఉండగా ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనాలు మాత్రం చల్లని వాతావరణానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బైంసా ఆర్డీవో, జిల్లా ఇంచార్జ్ డిఎస్ఓ కోమల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం వృధా చేయరాదని, అందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువ ఉండడం వల్ల ఆరోగ్యంగా ఉండడానికి వీలుంటుందని, పోషక విలువలు ఎక్కువ ఉన్నదున్న వృధా చేయకుండా వండుకొని తినాలని అన్నారు. కొన్ని చోట్ల సన్న బియ్యం పంపిణీ ఆలస్యం అవుతున్నందున ప్రజలు ఆందోళన చెందవద్దని అందరికీ సన్న బియ్యం పంపిణీ చెయ్యడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఇంతకుముందు దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల వాటిని దళారులకు అమ్ముకొని ప్రజల పక్కదారి పట్టించేవారని,ఈ సన్న బియ్యం వల్ల ఎవరు కూడా బియ్యాని వృధా చేయాలని అన్నారు. ప్రతి రేషన్ షాప్ లో గతంలో కంటే ఎక్కువగా ప్రజలు ముందుకు వచ్చి బియ్యాన్ని తీసుకెళ్తున్నారు అన్నారు. నాణ్యత



ఎలాంటి తేడా లేకుండా ఇలాగే బియ్యం పంతఃం ఉంటుందని దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఎం.ఓ సుధాకర్,ఎమ్మార్వో సుజాత,ఆర్య సత్యనారాయణ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కామ్రేడ్ వెంకటేశ్వర్లు, వాసు దేవరావులకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో ప్రజా సాంస్కృతిక కేతనం, అరుణోదయ వ్యవస్థాపకుడు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వర్లు, శ్రీకాకుళ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు లకు ఘన నివాళులు అర్పించారు. అరుణోదయ వ్యవస్థాపకుడు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వర్లు శ్రీకాకుళ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావుల వర్థంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూల దండ ఘన నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. కళ కల కోసం కాదు అని ప్రజల కోసం అని భావించి జీవితాంతం పీడిత ప్రజల కోసం తన కళాన్ని గళాన్ని వినిపించిన మహానీయుడు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వర్లు అని అన్నారు. జానపద, ఒగ్గు కథ, బుర్ర కథల ద్వారా ప్రజ సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేశాడని గుర్తు చేశారు. శ్రామిక సంస్కృతిని గుర్తించి వారి మాటలనే పాటలుగా మలిచి దోపిడి వ్యవస్థపై తిరుగుబాటు జెండాను ఎగరేసిన ప్రజా కవి కానూరి అని పేర్కొన్నారు. ఆ పోరాట నాయకుల్లో ముఖ్యుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు టి.సాయిలు, రాజ్ కుమార్, సురేష్, వినోద్, సాయాగౌడ్, శ్రీనివాస్, పేట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ



**ప్రజాపక్షం/ఎడపల్లి:** కార్పొరేట్ స్థాయి స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు తలపడుతున్నాయనడానికి కుర్నాపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నిదర్శనమని ఎంఈఓ గాలప్ప అన్నారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి మండల పరిషత్ ప్రైమరీ స్కూళ్లో మంగళవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం కార్పొరేట్ స్థాయిలో ఉందని, విద్యార్థులచే, చిన్నారులచే నిర్వహించిన ప్రదర్శనలు తారస్థాయిలో ఉన్నాయని అన్నారు. ఇంతటి గొప్ప సక్సెస్‌కు కారణం పాఠశాల ఉపాధ్యాయ బృందం కృషే అని ఎంఈఓ అన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి హెడ్మాస్టర్ శోభాదేవి, ఉపాధ్యాయులు రమణ, సత్యనారాయణ, శ్రీకాంత్, రవళి లను శాలువాలతో మెమోంటోలతో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మెధ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్, నాయకులు కృష్ణ రెడ్డి, గాంధారి హన్మంత్ రెడ్డి, ఏజాస్ తదితరులున్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని స్మరించుకుందాం..



**ప్రజాపక్షం/ఖానాపూర్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చెయ్యాలని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌక్ మున్సిపల్ పార్కులో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కరపత్రలు విడుదల చేశారు. ఈ నెల 14న ఖానాపూర్ పట్టణ కేంద్రంలో జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి కరపత్రలు విడుదల చేసి ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సుజాతకు ఖానాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ కు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాదవ్ కృష్ణకు, ఎఫ్ ఆర్ ఓ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ కిరణ్‌కు, ఎస్బిఐ కార్యాలయం మేనేజర్ అలాగే సిబ్బందికి, కరపత్రాలు అందజేసే ఆహ్వానించడం జరిగింది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 14వ తేదీన జరిగే అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వివిధ ఆఫీసుల్లో అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్, యువజన సంఘం అధ్యక్షుడు మేస సతీష్, నాయకులు రాజ గంగన్న కావలి సంతోష్, ద్యావతి రాజేశ్వర్, నేత శ్యామ్, త్రివేందర్, శ్రీహరి, మ్యదరీ రాజేశ్వర్, దాసరీ రాజన్న నరేష్, వసంత్ శ్రీనివాస్, గొర్రె గంగాధర్, పాల్గొన్నారు.

## బొల్లారంలో 5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో 5 లక్షల రూపాయల నిధుల సీసీ రోడ్డు కు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని గడపగడపకు సిసి రోడ్డు వేసి గ్రామాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కృత నిశ్చయంతో ఉన్నారని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో గ్రామాలను అభివృద్ధి పరచడానికి బిజెపి సిద్ధంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెట్టిపల్లి రవికిషోర్, మండల ప్రధాన కార్యదర్శి గోపు ప్రవీణ్, భూత్ అధ్యక్షులు కంకణల రాజు, మండల నాయకులు సండే సారి మల్లికార్జున్,మండల కార్యవర్గ సభ్యులు వినోద్ గౌతమ్ బిజెపి సీనియర్ నాయకులు ఆకుల బాబు మంద రాజేందర్ తోట శేఖర్ మల్లారం తిరుపతి ఉప సర్పంచ్ అవునూరి తిరుపతి నరేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ కల్లు డిపోపై ఎక్సైజ్ దాడులు..

**ప్రజాపక్షం/ఎడపలి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న కల్లు డిపో పై ఎక్సైజ్ ఎన్‌ఫోర్సమెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో చోటు చేసుకున్న కల్తీ కల్లు ఘటనపై పై ఎక్సైజ్ అధికారులు స్పందించి జిల్లాలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కల్లు డిపోలపై, కల్లు బట్టీలపై దాడులు ప్రారంభించారు. ఈ క్రమంలో జాన్కంపేట్ గ్రామంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కల్లు డిపో పై నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో గురువారం దాడులు చేపట్టి నిల్వ ఉన్న కల్లును ధ్వంసం చేశారు. అనంతరం కల్లు బట్టి నిర్వహకున్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే తాము ఏం తాగాలని అధికారులను జనాలు ప్రశ్నించగా కల్తీ కల్లు బదులు కొబ్బరి నీళ్లు త్రాగండని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న చెప్పడం కొసమెరుపు.

## భవిష్యత్ తరాల కోసం నీటి సంరక్షణచేయాలి:శ్రీనివాస్




**ప్రజాపక్షం/సారంగాపూర్ :** వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమం లో భాగంగా నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జౌళి గ్రామంలో యాత్ర ను జండా ఊపి జిల్లా పంచాయతీ/గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ ప్రారంభం చేశారు.నీటిని కాపాడుకోవాలని,నీటి నిల్వ పనులు,ఇంకుడు గుంతలు చేయాలని,చెట్లను పెంచాలని తెలిపారు.నీటి కుంటలు,రాళ్ల కట్టలు,కందకాలు,ఫారం పండు,చిన్న నీటి కంటలు,చెక్ డ్యాం వంటి పనులు చేయటం ద్వారా బావి తరాలకు నీటి కొరత లేకుండా చేసిన వారం అవుతాం అని తెలిపారు అలాగే నీటి కార్యక్రమం లో భగస్వామి ఐన వారిని సన్మానం చేస్తారు తర్వాత మొక్కలను నాటడం జరిగిన,ప్రతి పౌరులు,ప్రతి గ్రామం లో నీటి పొదుపు నీటి నిల్వ పనులు తప్పక చేయాలని తెలిపారు.తర్వాత విడియో ద్వారా వారికి నీటి సంరక్షణ పనుల ను విడియో ద్వారా చూపెట్టడం జరిగినది.ఇట్టి కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్,ఎంపిడిఓ,తాహసిల్దార్,వాటర్షెడ్ కార్యక్రమ అధికారి,ఎంపీవో,డిఆర్పి,ఏపీఓ,ఎపిఎం,హార్టికల్ ఆఫీసర్,ఫారెస్ట్ ఆఫీసర్,టెక్నికల్ అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శి,ఎఫ్ఏ గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి,అగ్గి మల్లన్న ఆలయాలలో దొంగతనాలు..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలో వివిధ ఆలయాలలో దొంగతనలు జరగడం చర్చనియ ఆంశం అయినది.దీనిని గురించి ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ మాట్లాడుతూ,ఖానాపూర్ పట్టణంలో కొమురం భీమ్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గుర్తు తెలియని దొంగలు గుడి తలుపు,తాళాలు పగులగొట్టి నగదు దొంగిలించారు అని,దొంగలించ బడిన నగలు,నగదు మొత్తం విలువ 10,500/ వరకు ఉంటుంది అని ఆన్నారు.అదే విధంగా తర్లపాడ్ గ్రామ శివారున గల శ్రీ అగ్గి మల్లన గుడిలో హుండీ పగుల గొట్టి గుడిలోని నగలు,నగదు సుమారు 3000/ వేల రూపాయలు దొంగలించారు అని దొంగలించ బడిన నగలు,నగదు మొత్తం విలువ 30,000/ వరకు ఉంటుందని అని అన్నారు.వివిధ ప్రాంతాల్లో వీటి గురించి ఫిర్యాదు చేసిన ఖానాపూర్ లో కామోజీ శ్రీనివాస్,తర్లపాడు లో ఏనుగుల చంద్ర భూషణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఖానాపూర్ ఎస్సై గైక్వాడ్ రాహుల్ అన్నారు.త్వరలో పట్టుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎస్ఐ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తపాలా శాఖ సేవలపై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో గురువారం స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో భారత ప్రభుత్వం వారి తపాల శాఖ సేవల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నాల్గవ తరగతి, ఐదవ తరగతి విద్యార్థుల చేత పోస్ట్‌కార్డులు వ్రాయించి పాఠశాలకు సమీపంలోని పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి విద్యార్థుల చేత పోస్ట్ భాక్స్‌లో వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, రమణాచారి, సాగర్, నరసింహమూర్తి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో ముమ్మరంగా బడిబాట ప్రచారం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలో బడిబాట ప్రచార కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ క్యాంపెయిన్ లో భాగంగా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం మోర్తాడ్‌లోని కేసీఆర్ కాలనీ నందు బడిబాట ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాల గురించి, విద్యార్థుల ప్రగతి గురించి ప్రతి ఇంటింటికి ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలరాజు, సాగర్, నరసింహమూర్తి, రమణ చారి విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఎడపలి:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలుశిక్ష పడినట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన సాటాపూర్‌కు చెందిన అఫ్రోజ్, మహారాష్ట్ర వాసి బాలాజీ మోరేలకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిద్దరిని స్థానిక పోలీసులు కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ స్టేట్ మేజిస్ట్రేట్ శేష తల్పసాయి రెండు రోజులు జైలు శిక్ష విధించగా, మరికొందరికి రూ.2,500 జరిమానా విధించారు. తాగి వాహనాలు నడపరాదని ఎస్సై తెలిపారు.

# నిజామాబాద్ జిల్లాలో కిడ్నాప్, కామారెడ్డి జిల్లాలో లభ్యం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జిల్లా కేంద్రంలో గత మూడు రోజుల క్రితం కిడ్నాప్‌కు గురైన బాలిక ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. జిల్లా కేంద్రంలో కిడ్నాప్‌కు గురైన బాలికను నిందితుడు కామారెడ్డి జిల్లాలోని తన ఇంట్లో ఉంచినట్లు పోలీసులు గుర్తించి బాలికను సురక్షితంగా తల్లి చెంతకు చేర్చారు. నిందితుడు మాత్రం పరారీలో ఉన్నాడు. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన మూడేళ్ల చిన్నారి రమ్య తన అమ్మమ్మతో కలిసి ఏప్రిల్ 7న రాత్రి నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ ప్రాంతంలో నిద్రించగా అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బాలికను కిడ్నాప్ చేసి సమాదు చేసిన వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి ప్రత్యేక బృందాలతో బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడు కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ గ్రామంలోని తన తమ్ముడి ఇంట్లో ఉంచి అక్కడి నుండి పారిపోయినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. సాంకేతిక ఆధారాల ద్వారా బాలిక ఆచూకీ గుర్తించిన పోలీసులు బాలాజీ అనే నిందితుడు బాలికను జిల్లా కేంద్రం నుండి కిడ్నాప్ చేసినట్లుగా



గుర్తించారు.

**బాలికను సురక్షితంగా తల్లి చెంతకు చేర్చిన పోలీసులు :** బాలికను సురక్షితంగా పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక కిడ్నాప్ కేసును చేధించిన ఎస్‌హెచ్‌ఓ రఘుపతితో పాటు సిబ్బందిని సీపీ సాయిచైతన్యతో పాటు ఏసీపీ రాజావెంకటరెడ్డి తదితరులు అభినందించారు.

# సన్న బియ్యంతో పేదల హర్షం కడుపు నిండా భోజనం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బివై నగర్‌లో చేనేత కార్మికుని ఇంట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంతో మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, నలినికాంత్‌లు చేనేత కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేశారని వాటిని ఎవరూ తినలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఇప్పుడు పేదలందరూ కడుపునిండా అన్నం తింటున్నారని అన్నారు. పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మహిళా నాయకురాలు మడుపు శ్రీదేవి, జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సామాల రోజా, సుధ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి. కాజా పాల్గొన్నారు.

# వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి ఉత్కంఠకు తెర



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం బార్ అసోసియేషన్ హాల్లో జరగగా అధ్యక్ష పదవికి పోటీ చేసిన గుండా రవి, గుడిసె సదానందం కు చెరి 48 ఓట్లు రావడంతో ఎన్నిక టై అయింది. దీంతో ఎన్నికల అధికారి ఇద్దరి అభ్యర్థులతో చర్చలు జరపగా ఇరువురు సభ్యులు ఒప్పుకోకపోవడంతో ఎన్నికను ఎన్నికల అధికారి కేశన్న గారి గోపికృష్ణ వాయిదా వేశారు. గురువారం మరొకసారి ఎన్నికల అధికారి ఇద్దరు సభ్యులతో సమావేశం నిర్వహించగా, శాంతియుత వాతావరణం లో ఇరువురు సభ్యులు చెరి ఆరు నెలలు అధ్యక్ష పదవి లో కొనసాగుటకు ఒప్పుకున్నారు. మొదటి ఆరు నెలలు గుండా రవి, తర్వాత ఆరు నెలలు గుడిసె సదానందం పదవిలో కొనసాగుటకు ఒప్పందం కుదిరింది. దీంతో నిన్నటి నుండి ఉత్కంఠకు దారి తీసిన అధ్యక్ష ఎన్నికలకు తెరపడింది.

# మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు మాతృ వియోగం

**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమెర్ మాతృమూర్తి గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. షకీల్ తల్లి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో ఆమె ఆరోగ్యం క్షీణించడంతో గురువారం ఉదయం కన్నుమూశారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ ఇంట్లో విషాదం నెలకొంది. గత కొన్ని నెలలుగా దుబాయిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్ తన తల్లి మరణ వార్త వినగానే హుటాహుటిన బయలు దేరి శంషాబాద్ ఎయిర్ పోర్టు చేరుకొన్న ఆయనను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఆయన పాస్‌పోర్ట్ ను సీజ్ చేసి తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ బోధన్ పట్టణంలోని తన స్వగృహానికి చేరుకొని తల్లి పార్థివ దేహాన్ని చూసి కన్నీరుమున్నీరై విలపించారు. ఈ క్రమంలో పలువురు రాజకీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్త, బోధన్ మాజీ చైర్ పర్సన్ భర్త శరత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు మాజీ ఎమ్మెల్యే షకీల్ ను పరామర్శించారు. షకీల్ తల్లి అంత్యక్రియలు శక్కర్ నగర్‌లోని మజీద్ అసర్‌కి నమాజ్(ప్రార్థన) అనంతరం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

# సెకండ్ హ్యాండ్ మొబైల్ రసీదు లేకుండా కొనుగోలు చేయవద్దు



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** జిల్లాలో ఇప్పటివరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 1887 ఫోన్లు గుర్తించి 1587 ఫోన్లను సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు అందించడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో చోరీకి గురైన పోగొట్టుకున్న ఫోన్లను రికవరి మేళ ద్వారా బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 84.1 శాతం రికవరీ చేసి బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన www.ceir.gov.in (CEIR) అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో 100 మొబైల్ ఫోన్లను (సుమారు 10లక్షల రూ.ల విలువ గల) బాధితులకు అందజేశామన్నారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిదే ఒక చిన్న లావాదేవి కూడా చేయలేని, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్ వంటివి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన నేరగాళ్లు మొబైల్ దొంగిలించి వీక్ పాస్‌వర్డ్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారని అన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహా డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా సెకంట్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లయితే అట్టి షాపు యజమాని నుండి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్‌లను మొబైల్ షాపులలో అమ్ముతున్నారని తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైనా దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లయితే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, ఐటికోర్ ఎస్సై కిరణ్ కుమార్, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్సై శ్రీకాంత్, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# విలేకరి రక్తదానం

**ప్రజాపక్షం/వేములవాడ:** సిరిసిల్ల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ సాధిక్ అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ రక్తహీనత కలగడంతో, మిత్రుల ద్వారా సమాచారం తెలుసుకున్న వేములవాడ పట్టణానికి చెందిన ప్రజాపక్షం టౌన్ రిపోర్టర్ సయ్యద్ ఫహద్ పాషా రక్తం అందించి శభాష్ అనిపించుకున్నారు. సమాజంలో ప్రజల సమస్యపై ప్రభుత్వానికి వారధిగా నిలవడమే కాకుండా మానవత్వంతో తోటి మనిషికి ఇబ్బందుల్లో ఉన్నపుడు రక్తం అందించి సహాయం చేసిన సయ్యద్ ఫహద్ పాషాను రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజాపక్షం పత్రిక స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, వేములవాడ రవికుమార్, మండల రిపోర్టర్లు అభినందించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** శుభ్రపర్చిన ధాన్యం తెచ్చి పూర్తి మద్దతు ధర పొందాలని రైతులకు జిల్లా కలెక్టర్ హితవు పలికారు. గురువారం ఆర్మూర్ మండలం మంథని, జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామాలతో పాటు మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం కొన్న వెంటనే వారికి పూర్తి వివరాలతో కూడిన రసీదును తప్పనిసరిగా అందించాలని, ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇన్



చార్జి డీఆర్‌డీఓ సాయిగౌడ్, ఆర్డీఓ రాజాగౌడ్, డీసీఓ ఎన్.శ్రీనివాస్‌రావు, డీఎస్‌ఓ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయిడీయం శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

# గాలివాన బీభత్సం.అకాల వర్షాలతో రైతన్నలు ఆగమాగం

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ అర్బన్, రూరల్ మండలాల్లో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టిస్తోంది.పలుచోట్ల భారీ వర్షం కురిసింది. అకాల వర్షం ఆగమాగం చేసింది.పలు చోట్ల పంటలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడ్డాయి. కరెంట్ తీగలు తెగిపోయాయి. రేకుల ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం గ్రామ సమీపంలో సాగు చేసిన వరి పంట రాత్రి కురిసిన అకాల వర్షానికి నేలకొరిగింది. దీంతో ధాన్యం నేలపాలు అయ్యాయని రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట అకాల వర్షంతో నేలకొరవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. అప్పు చేసి పంటలు సాగు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

# ధరల పెంపును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. గురువారం ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ, పెట్రోల్, డీజిల్ దరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు దర్నా కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో యుపిఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్ దర రూ. 400, పెట్రోల్ లీటరు ధర రూ. 65, డీజిల్ రూ. 50 ఉన్న పరిస్థితుల్లో, 2014 ఎన్నికల సమయంలో బిజెపి పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు స్మృతి ఇరానీ చీర, గాజులు పంపించిన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఓట్లు దండుకున్నారన్నారు. కానీ గత 11 ఏళ్ళుగా అధికారంలో ఉన్న బిజెపి మోదీ ప్రభుత్వం నిత్యవసర వస్తువులను 300 రెట్లు పెంచడమే కాక కార్మిక, కర్షక వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తూ యావత్ కార్మిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని నీరుగారుస్తూ బడా పెట్టుబడిదారుల కొమ్ము కాస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. గోదావరి, కె. సంధ్యారాణి పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, టియుసిఐ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా సగ్గు రాహుల్ నియామకం

**ప్రజాపక్షం/వేములవాడ :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వేములవాడ పట్టణ బిజెపి శాఖ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శాఖ ఆధ్వర్యంలో పలు పదవులను ఆయన భర్తీ చేశారు. వేములవాడ పట్టణ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన సగ్గు రాహుల్ ను ఏకగ్రీవంగా నియమిస్తూ ఆయనకు నియమక పత్రాన్ని బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ తన నియమకానికి కృషి చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గడ్డమీద శ్రీనివాస్, పట్టణ బిజెపి నేతలకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.